# సింగిల్ పేజీ కథలు

## బ్రతుకులోని హాయి



కరుణాకరం కోటీశ్వరుడు. అసిస్టెంట్సు చెపితేకాని ఏ బేంకుల్లో ఎన్ని కోట్లున్నాయో అతనికే తెలియదు. ఇంట్లోంచి బయటికి వెళ్ళేటప్పుడు ఇంటి చివరి మెట్టుమీద నుంచి తిన్నగా తన లేన్సర్‌లోనో, క్వాలిస్‌లోనో, శాంట్రోలోనో అడుగుపెడతాడు. అలాగే తన ఆఫీసులో కడుగు పెట్టేటప్పుడు పోర్టికో మొదటి మెట్టుదాకా కారు తీసుకుపోతుంది!

అలాంటి శ్రీమంతుడికి అనుకోకుండా హఠాత్తుగా ఓ రోజున నేలమీద అడుగుపెట్టవల్సిన అవసరం వచ్చింది.

ఆఫీసు పనిమీద బీచ్ పక్కనే వున్న రోడ్డుమీద రయ్‌మని వెళ్ళిపోతున్న కారు వార్నింగ్ ఇవ్వకుండా చటుక్కున ఆగిపోయింది. ఎప్పుడూ పక్కన వుండే సెక్రటరీ కూడా ఆవేళ లేడు. కారు దిగి బోయ్‌నెట్ ఎత్తి పరీక్షించిన డ్రయివరు... తన వల్ల రిపేరు కాదన్నట్లు ముఖం పెట్టాడు.

''మెకానిక్‌కి ఫోన్ చేసి ఏడు'' అని తన సెల్‌ఫోన్ని డ్రయివరు వైపు విసిరినంత పని చేసాడు కరుణాకరం.

డ్రయివరు ఫోన్ చేశాడు. మెకానిక్ మరికాసేపటికి హాజరవుతానని చెప్పాడు. వాడు వచ్చాక కారుని రిపేరు చేయటానికి ఎంతసేపు పడుతుందో తెలియదు. మరో కారును పంపమని సెక్రటరీకి ఫోన్ చేసాడు కరుణాకరం. ఒక కారుని కొడుకు తీసుకెళ్ళాడట! మరో కారు సర్వీసింగ్‌కి వెళ్ళిందిట! ఎవరో కంపెనీ పనిమీద వచ్చిన వాళ్ళని ఎయిర్‌పోర్టు దగ్గర దింపటానికి వెళ్ళింది మరో కారు. ఇంటి దగ్గర భార్య అవసరానికి మరో కారు వదిలేసాడు. కూతురు తన కారు తీసుకొని కాలేజీకి వెళ్ళింది. ఇన్ని కార్లున్నా తనకి అత్యవసర సమయంలో ఒక్కటీ దొరక్కపోయేసరికి అతనికి విసుగుకన్నా ఆశ్చర్యమే ఎక్కువ కలిగింది. మెకానిక్ వచ్చి ఈ కారుని రిపేరు చేసేవరకు తనక్కడ నిరీక్షించక తప్పదని గ్రహింపునకు వచ్చేసరికి అతనికి విడ్డూరుమనిపించింది. ఎంత కోటీశ్వరుడయినా తనూ ఒకప్పుడు అశక్తుడు కాక తప్పదన్న 'నిజం' టక్కున తట్టింది. అయినా దాన్ని ఒప్పుకోటానికి అతనికి ఐశ్వర్యం తెచ్చిన అహం అడ్డు వచ్చింది. 'ఏదో ఒక్కసారి జరిగినదానికి ఇంత హైరానా పడటమెందుకు?' అని తనకుతాను నచ్చ చెప్పుకుంటూ కార్లో అలా కూర్చోలేక క్రిందకి దిగాడు.

పక్కనే బీచి...

అక్కడక్కడా పరుగులెత్తే పిల్లలు, పడవల్లో చేపలు పట్టటానికి వెళ్ళే జాలరులు. ఏవో చిన్ననాటి జ్ఞాపకాలు తోడుకు వచ్చాయి. కాలం ఎంత వేగంగా వెళ్ళిపోయింది అనుకుంటూ అప్రయత్నంగా బీచిలోకి నడిచిపోయాడు కరుణాకరం!

అక్కడ చేపలు పట్టే జాలరి ఒకడు పడవకి జార్లగిలబడి కాలుమీద కాలేసుకుని బీడీ కాలుస్తూ కనిపించాడు. అనేకమంది సముద్రంలోకి పోతూంటే వీడొక్కడూ అలా కూర్చునేసరికి చిత్రమనిపించింది అతనికి. ''నీ పేరేంటీ?'' అని అడిగాడు.

బీడీని వినయంగా ముఖం పక్కకి తిప్పి దమ్ము లాగి ''చింతాలంటారయ్యా!'' అన్నాడు.

''నువ్వు చేపలు పట్టటానికి వెళ్ళలేదేం''

''ఇయ్యేల్టికి సరిపడ చేపల్ని ఎప్పుడో పట్టేసాను బాబూ!'' అన్నాడు వాడు నవ్వుతూ.

ఆ జవాబు కరుణాకరానికి నచ్చలేదు. ''ఇంకా బోల్డంత పొద్దుంది. మళ్ళీ వెళ్ళి మరికొన్ని చేపల్ని పట్టచ్చుకదా!'' అలా అడుగుతున్నప్పుడు తనో పెద్ద శ్రీమంతుడు, ఇలాంటి పేదవాడితో తనకేం మాటలు... అనే తలంపు చిత్రంగా రాలేదతనికి. వీడెందుకిలా సోమరిగా బీడీ కాలుస్తూ కూర్చున్నాడన్న అసహనం అతని చేత అలా అడిగించింది. తన కంపెనీలో ఎవరు పని దొంగలయినా ఇట్టే మండిపడిపోయే తన తత్వం- కాని విషయంలో కూడా జోక్యం చేసుకునేలా చేసింది.

''వాట్ని ఏం చేసుకుంటాను?'' అన్నాడు చింతాలు తొణక్కుండా.

కరుణాకరానికి ఆశ్చర్యం కలిగింది. ''ఇంకా డబ్బు సంపాదించవచ్చుకదా!''

''చిత్తం! ఆ డబ్బు సంపాదించి ఏం చేయమంటారు?''

''మరికొన్ని పడవలు కొనవచ్చు. పనివాళ్ళని పెట్టుకుని మరిన్ని చేపలు పట్టచ్చు!''

''అన్ని చేపలు పట్టి ఏం చేయను?''

''అదేంమాట? వాటిని అమ్మితే మరింత డబ్బొస్తుంది కదా! దాంతో మోటారుబోటు కొనుక్కోవచ్చు!''

''దాన్ని నేనేం చేసుకోను?''

''అలాగంటావేమిటి? మోటారుబోటుతో ఇంకా సముద్రంలోపలికి వెడితే బోల్డన్ని చేపల్ని పట్టుకురావచ్చు. వాటిని అమ్మితే ఇంకా చాలా డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో మరిన్ని మోటారుబోట్లు కొనచ్చు. వాటితో నీ చేపల వ్యాపారం గొప్పగా పెరిగిపోతుంది. ఇంకా ఇంకా ఎంతో డబ్బు వస్తుంది''

''అప్పుడు ఏమవుతుందయ్యా?''

''నాలా కోటీశ్వరుడివయిపోతావు''

''మీరు కోటీశ్వరులా బాబూ!''

''అవును''

''అయితే, మీ అంతటివాడ్ని అయ్యాక నేనేం చేయాలి బాబూ!''

''కడుపునిండా తిని కాలుమీద కాలేసుకుని హాయిగా ఉండచ్చు''

దానికి చింతాలు గలగలా నవ్వాడు.

కరుణాకరం ఖంగు తిన్నాడు. ''ఎందుకు నవ్వుతున్నావు?''

బీడీ పొగ వదులుతూ చింతాలు ఇలా అన్నాడు. ''మాయావిడ పెట్టిన బువ్వ కడుపు నిండా తిని నేనిప్పుడు చేస్తున్నది అదే కదా బాబూ!''

**-తటవర్తి రామచంద్రరావు (న్యూఢిల్లీ)**